

# ఆత్మీయత

తాళ్ళూరు నాగేశ్వరరావు

జగ్గన్నపేట జోగిరాజుగారి కొబ్బరి తోటంటే ఆ చుట్టుపక్కల అటుపదిఆవడా ఇటు పదిఆవడా గొప్ప పేరు. అది ఎకరంలో ఉన్నతోటైనా-ఆకొబ్బరిచెట్లపెరుగుదలకూ, చక్కదనానికీ, వరసలకూ, విరివైనకాపుకూ దానికదే సాటి అనీ; కోనసీమ మొత్తంలో అంత అందమైన తోటలేదనీ చెప్పుకోవడం కద్దు. ఆ ఊరికి ఏచుట్టంవచ్చినా, ఏ ఛోటా ఆఫీసరు వేంచేసినా - కాస్తంత సేపు ఆతోట సౌందర్యాన్ని వాళ్ళంతా కళ్ళుచేసుకొని తిలకించనిదీ, ఆ కొబ్బరాకుల చల్లని నీడను విశ్రమించనిదీ వెళ్ళరు. అది గోదావరి పాయ ఒడ్డునున్నది. సూర్యోదయపువేళనూ, సూర్యాస్తమయపు సమయంలోనూ, వెన్నెల రోజుల్లోనూ ఆతోట సౌందర్యాన్ని చూడడం - నిజంగా జీవితంలో ఒక మధురానుభూతిని మనస్సులో ముద్దరసుద్దిగా ముద్రించుకొన్నట్లే.

పచ్చదనంలో పచ్చదనం ఐక్యమైనట్టుగా- ఆ తోటచుట్టూ పచ్చని అరటితోటలూ, వాటి చుట్టూ పచ్చని వరిచేలు. ప్రకృతికన్య పచ్చ చీరధరించి, లోకాన్ని నిత్యకల్యాణం పచ్చ తోరణంగా మార్చిందా అన్నట్టుగా ఉంది ప్రకృతి వాతావరణం. సూర్యుని అంతిమ కిరణాలు ఆ తోట ఆకులపై బడి మెరుస్తూండగా, తూర్పుగాలి చల్లదనంతో చేతులు కలిపి వీస్తూండగా, గోదావరి నిండుకుండలా ప్రశాంతంగా ప్రవహిస్తూండగా - ఆ సాయంత్రం ఆ కొబ్బరితోట దగ్గర జోగి రాజుగారి అబ్బాయి సూర్రాజు కొబ్బరి కాయల వ్యాపారి కోటిలింగానికి తోటబేరం ఫైసలుచేసి యిచ్చేశాడు.

ఆయేటి కాపుమొత్తం రెండువేల అయిదొందల రూపాయలు. నిరుటికంటే మూడొందలు ఎక్కువ. తనకే.లాభం అనుకున్నాడు సూర్రాజు. మూడువేలు చెబుతాదేమోనని బిక్కు-బిక్కుమన్న కోటిలింగానికి అ బేరమెంతో చౌకగా తోచింది. వెంటనే లాల్చీజేబులోంచి మూడొందలు నగదుతీసి బయానాగా సూర్రాజుకు ఇవ్వబోయాడు కోటిలింగం. ఆయన ఆదుర్దా ఆయనదీ. కాని సూర్రాజు చేయి చాపలేదు.

''లింగంగారూ! కాస్త ఆగండి. మా నాన్నచెవిలో ఈ ముక్కవేసి మరీ బయానా పుచ్చుకుంటాను'' అన్నాడు సూర్రాజు తండ్రి పెద్దరికంమీద తనకున్న భక్తి శ్రద్ధల్ని చాటుకొంటూ.

''బాబ్బాబూ! మళ్లీ పేచీ పెట్టకండి. మీ మాటమాటే. బేరం బేరమే!'' అన్నాడు కోటిలింగం చేతులు నలుపుకుంటూ.

సూర్రాజు లేతకొబ్బరికాయలా చిరునవ్వు నవ్వాడు.

''ఇంతలో ఏం పుట్టిమునిగి పోయిందని అంత భయపడతావ్? నేను బేరం యిస్తే మా నాన్న కాదంటాడా? కాదన్నా నేను వూరుకుంటానా?'' అన్నాడు సూర్రాజు అభయహస్త మిస్తున్నంత ధీమాగా.

అయినా కోటిలింగం మనస్సులో భయ సందేహాలు సద్దుమణగలేదు. అరచేతిలోపడ్డ అరటిపండు జారిపోతూందంటే ఎవరికైనా దడే!

"అదికాదు బాబుగారూ! మీవంశం నీతీ నిజాయితీలకు నిప్పులాంటిదని నాకు తెలుసు. అన్నమాటతప్పే అలవాటు మీ కుటుంబంలో తాతముత్తాతలనుంచీ లేదు. కాని... మీ నాన్నగారు ఏమంటారోనని, నేను అనవసరంగా భయపడి పోతున్నాను. బయానా తీసుకొంటే ఆ భయంకాస్తా పోతుంది'' అన్నాడు కోటిలింగం డబ్బు యివ్వబోతూ.

నిరాలోచనగా సూర్రాజు ఆ డబ్బు అందుకున్నాడు.


కోటిలింగం సంతోషంగా భుజాలు దులుపుకున్నాడు. తోటకేసి ఒక్కసారి కలియజూసుకున్నాడు. ఒక్కో-చెట్టుకు రెండుమూడు గెలలు. గెలగెలకూ పది పదిహేను కాయలు. టోకుబేరానికి అమ్మినా ఒక్కొక్క కాయ పావలా గిడుతుంది. ఆ లెక్కన తోట మొత్తంమీద వెయ్యి, పదిహేను వందలు లాభం ఇట్టే చేతిలోకొచ్చి పడుతుంది. కోటిలింగం కడుపు అంకెల లాభంతో తీర్థం సేవించినంత సంతోషంతో నిండిపోయింది.

సూర్రాజుకు సాష్టాంగ నమస్కారం చేసి వెళ్ళిపోయాడు కోటిలింగం.

మునిమాపు వేళ కావడంతో ఇంటికి బయలుదేరాడు సూర్రాజు.

మట్టిని నమ్ముకొని జీవించే కుటుంబాలలో జోగిరాజుది ఒకటి. తరతరాలనుంచీ ఆ వంశంలోని మనుషులు వ్యవసాయం మీదనే బ్రతుకుతున్నారు. జోగిరాజు తండ్రీ, తాతా వ్యవసాయపు పనుల్లో దిట్టలుగా ఊళ్ళో వాసికెక్కారు. జోగిరాజుకూడా నిన్న మొన్నటిదాకా 'పనివాడు' అనిపించుకొన్నవాడైతే. కాని పోతే నాలుగైదేళ్ళనుంచీ అనారోగ్య కారణాలవల్ల పొలంలో నడుం వొంచలేకపోతున్నాడు. ఇప్పుడా అవసరంకూడా లేదు. ఒక్కగానొక్క కొడుకు సూర్రాజు పూర్తిగా చేతికి అందివచ్చాడు. ఉన్న ఆరెకరాల మాగాణినీ, మూడెకరాల అరటి తోటనూ, ఎకరం కొబ్బరితోటనూ సాగుచేసి, ఏటా ఫలసాయాన్ని తీసుకొస్తున్నాడు. ఇప్పుడు దాదాపు పొలం పనులన్నీ సూర్రాజు చేతిమీదుగానే నడుస్తున్నాయి. అప్పుడప్పుడూ జోగిరాజు నోటితీటకొద్దీ సలహాలిస్తూ ఉంటాడు. ఆ సలహాల్ని తన కిష్టమైతేనే సూర్రాజు పాటిస్తాడు, లేదా మెదలకుండా వూరుకొంటాడు.

ఇప్పుడు సూర్రాజు ఒక ఇంటివాడైనాడు. ఇద్దరు పిల్లలు. ఒక అబ్బాయీ, ఒక అమ్మాయీ. దినపత్రిక చదవగలిగే చదువు తప్ప ఆపైన సర్టిఫికెట్లు గల చదువు చదువుకోలేదు. తండ్రి చెప్పించలేదు; తను పట్టుబట్టి చదువుకోనూలేదు. జోగిరాజుకు మొదట్నుంచీ వానాకాలపు చదువులమీదకంటే, కొండ్రను నమ్ముకొని జీవించడమే ఉత్తమంగా తోస్తూ వొచ్చింది. అందుచేత కొడుకును సర్కారుబడిలో చేర్పించలేదు. తనలాగా సేద్యంలో అనుపానులన్నీ తెలుసుకొని, చదువులోనీళ్ళు కలపకుండా వ్యవసాయ వృత్తికి కట్టుబడివుంటే జీవితం పంటకాలువ పగిది సార్థకమౌతుందని ఆయన భావించడం జరిగింది.



తండ్రికి కొడుకుమీద ఎంతటి ప్రేమాభిమానాలు ఉన్నాయో, కొడుకుకూ తండ్రిమీద అంతటి భక్తి శ్రద్ధలూ, వినయ విధేయతలూ, ప్రేమాభిమానాలూ ఉన్నాయి. ఆ విషయం ఇరువురికీ తెలుసు. మధ్యన తల్లికి తెలుసు, ఊరివారందరికీ తెలుసు. అందుచేతనే సూర్రాజు తండ్రికి ఎరుకలేకుండానే తోట బేరం ఇచ్చేశాడు. తన బేరాన్ని తండ్రి ఆమోదిస్తాడనే విశ్వాసంకూడా అతనికున్నది. అందుచేత సూర్రాజు ఇంటికివస్తూ ఆ విషయాన్ని గురించి ఎక్కువ ఆలోచించలేదు.

సూర్రాజు ఇంటికి వచ్చేసరికి మసక చీకటిపడింది. ముందుగా దొడ్లోకి వెళ్ళి ఎడ్ల ముందు మేత ఉన్నదీ లేనిదీ చూసి, ఇంట్లోకి వచ్చాడు. ఆ సమయంలో జోగిరాజు ఇనుపపెట్టెముందు కూర్చుని ఉన్నాడు. అయిదు వందరూపాయల నోట్లను లోపల అరలో భద్రంగా పెడుతున్నాడు.

తల్లి వంటగదిలో ఆవపిండి అరటికాయ వేపుడు పెడుతోంది. భార్య దాలిగుండలో పాలకుండదగ్గిర కూర్చున్నది. పాలు పొంగకుండా చూస్తూ. పిల్లలు ఆపాటికే అన్నాలు తిని మంచాలెక్కారు.

"కొబ్బరితోట బేరానికిచ్చాను," అన్నాడు సూర్రాజు ఇనుపపెట్టె దగ్గరకొచ్చి.

మండువా దూలం హఠాత్తుగా విరిగి మీద బడ్డట్టుగా జోగిరాజు దిమ్మరపోయి కొడుకేసి తలెత్తి చూశాడు.

"మూడొందలు బయానాకూడా పుచ్చుకున్నాను," అంటూ సూర్రాజు లాల్చీ జేబులోంచి తీసి ఆ పైకాన్ని తండ్రి కివ్వబోయాడు.

కనురెప్పల్ని కదల్చకుండా కొడుకేసి

చూస్తూ కూర్చున్నాడు గానీ, జోగిరాజు ఆ పైకాన్ని అందుకోలేదు.

సూర్రాజు దిగ్భ్రమ చెందాడు.

కొన్నిక్షణాల తర్వాత ఆశ్చర్యాన్నుంచి తేరుకొన్నవాడై, "తోటను నిన్నెవరు బేరాని కివ్వమన్నార్రా?" అన్నాడు జోగిరాజు కాఠిన్యత నిండిన కంఠంతో.

సూర్రాజు మొహం కత్తిపీటకు లొంగని పండగడ్డయింది. ఆ ప్రశ్న తండ్రినుంచి ఊహించనిది. క్షణంలో సగం సేపు భూమి గుండ్రాతిగుండ్రంగా తిరిగింది.

"ఏం?" అన్నాడు సూర్రాజు ముక్కు-గోళ్ళపై ఉక్రోషం కర్కశంగా కదులాడగా.

"నా చెవిన వేయగూడదూ?"

"ఇప్పుడు వేస్తున్నాగా?"

"ఎవరికి బేరం ఇచ్చావ్?"

"కోటిలింగానికి."

"బయానాకూడా పుచ్చుకున్నావా?"

"ఆఁ!... మూడొందలు!"

"నేను చచ్చా ననుకున్నావా?"

ఇంటిపెద్ద కంఠం జీరబోయింది. సూర్రాజు గుండెలో గడ్డపలుగు దిగబడినంత పనైంది.

ఇరువురిమధ్యా కొన్నిక్షణాలపాటు నిశ్శబ్దం గడ్డకట్టింది.

"అదేంటి నాన్నా!" అన్నాడు సూర్రాజు పరిస్థితిని అర్థం చేసికోలేని అమాయకత్వంతో.

"ఏం చెప్పేది? పెద్దఘటాన్ని నేను వుండగానే నీ అంతట నువ్వే పెద్దపెద్ద వ్యవహారాల్లో తలదూరుస్తున్నావు. ఊళ్లో నా పరువు ప్రతిష్ఠలేం కావాలి? నామాట చెల్లుబడి ఏమైపోవాలి?"

"ఇప్పుడేం జరిగింది?"

"గంటక్రితమే కొబ్బరితోట కాపును నాసరయ్యకు రెండువేల అయిదొందలకు అమ్మేశాను. అయిదొందలు బయానాగా పుచ్చుకొన్నాను. ఆ డబ్బునే ఇదుగో ఇప్పుడే పెట్టెలో పెడుతున్నాను." అన్నాడు జోగిరాజు బ్లడ్‌ప్రెష రెచ్చిన ఆవేశంతో.

సూర్రాజు నిలువునా నిర్ఘాంతపోయాడు. కొన్నిక్షణాలపాటు రెండు పెదవులూ అంటుకుపోయాయి. జోగిరాజు కొడుక్కేసి చూస్తూ కూర్చుండిపోయాడు.

"నేను ముందు బేరం ఇచ్చాను" అన్నాడు సూర్రాజు.

"నీకంటె నేనే ముందు బేరం ఇచ్చాను." అన్నాడు జోగిరాజు.

"నామాట నిలబడాలి." అన్నాడు సూర్రాజు.

"నామాట నిలబడాలి," అన్నాడు జోగిరాజు.

"పుట్టి బుద్ధెరిగిన తర్వాత ఆడినమాట తప్పలేదు."

"ఆ విషయంలో నన్నే ఈ ఊళ్ళో మొదటగా చెప్పుకుంటార్రా! నీ వయస్సెంత? నా అనుభవమంత లేదు. ఈ ఇంటికి యజమానిని. ఊళ్లో పరువుప్రతిష్ఠలుగలవాణ్ణి. ఇచ్చిన బేరాన్ని కాదంటే రేపు నాసరయ్య నడివీధిలో 'టాంటాం' వేస్తాడు. ఇంటిపనం వీధిలో పొర్లాడుతుంది. ఆలోచించరా."

"నువ్వే ఆలోచించుకో నాన్నా! నీ కొడుకును. మన వంశపు పరువుప్రతిష్ఠలూ, సంప్రదాయాలూ, పట్టింపులూ ఇదరికీ తెలుసు. మాటకోసం మెడకాయతెగినా ఖాతరుచేయం. కోటిలింగానికి బేరం యిచ్చాను. ఆ మాట నిల్పుకోవల్సిందే! లేకపోతే రేపు నడివీధిలో నిలేసి నా పరువును నిలువునా తీసేస్తాడు. పరువుపోయిం తర్వాత పాకులాడి లాభమేమిటి?"

"మరి నా మాటేమిటి? ఇంతకాలమూ ఊళ్లో పెద్దమనిషిగా, నీతిపరునిగా, గౌరవంగా బ్రతుకుతూ వొచ్చాను. ఇప్పుడు తీసుకున్న బయానాను వాపసు యిస్తే-నలుగురూ నా ముఖాన ఖాండ్రించి ఉమ్మి వేయరూ! తండ్రి పరువు మర్యాదల్ని కాపాడవల్సిన బాధ్యత కొడుకు మీద ఉందిరా!"

"ఆ కాలం మారింది నాన్నా! కాలం ప్రకారమే మనుషులుకూడా మారాలి. కొడుకు గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ఇప్పుడు తండ్రిమీద ఉన్నది. ఎందుకంటే ముందు ముందు వంశాన్ని వృద్ధిచేసేది కొడుకే."

తండ్రీకొడుకుల సంవాదాన్ని తల్లీ, కోడలూ విన్నారు. కాని వాళ్ళిద్దరూ అందులో ఏ మాత్రం జోక్యం కలిగించుకోలేదు. కారణం ఆ ఇంట్లో ఆడవాళ్ళ పెత్తనం ఏ మాత్రం లేదు. కొంతకు వంటగదిలోకూడా వాళ్ళ పెత్తనం పరిమితమైనదే. మగవాళ్ళు వండమన్న వంటలు వండాల్సిందేగానీ, స్వతంత్రంగా ఏ కూరా వండటానికి లేదు. అంచేత వాళ్ళిద్దరూ నోళ్ళు నొక్కుకొని చూస్తూ తలుపుచాటున నిలబడారు.

ఆ రాత్రి ఆ ఇంట్లో ఎవ్వరూ భోజనాలు చేయలేదు. తండ్రీకొడుకూ పంతాలు పట్టుకొని భోంచేయలేదు. దానితో తల్లీ, కోడలూ కూడా భోజనం చేయడానికి లేకపోయింది.

ఆ మరునాడుకూడా తండ్రీ కొడుకులు కొంచెంసేపు ఘర్షణ పడారు. ఎవ్వరూ కొండదిగి రాలేదు. తాము యిచ్చిన బేరమే ఖరారని మూతులు బిగించుకు కూర్చున్నారు. ఎవరిమాట తఫావతుఅయినా వారికి తల తీసేసినంత అవమానంగా ఉంటుంది. సమస్యకు కనుచూపుమేరలో పరిష్కారమార్గం కనబడలేదు. కేసు మధ్యవర్తుల సలహాలదాకా పోయింది. మున్సబు జగన్నాధరాజు జోక్యం కలిగించుకొని తీర్పు చెప్పడానికి ప్రయత్నించాడుగానీ ప్రయోజనం లేకుండా పోయింది. సూర్రాజు తనపంతమే నెగ్గి తీరాలని జలగ పట్టు పట్టాడు.

ఆ మరునాడు ఉదయం తొమ్మిది గంటలకు నాసరయ్య వచ్చాడు జోగిరాజు దగ్గరకు— తోటలోని కాయను కోయిస్తానంటూ. "రెండురోజులు ఆగు నాసరయ్యా!" అన్నాడు జోగిరాజు. నాసరయ్య పెద్దమనిషి తరహాగా 'ఊఁ!' కొట్టి వెళ్ళాడు.

అరగంట తర్వాత కోటిలింగం వచ్చాడు సూర్రాజు దగ్గరకు– తోటలోని కాయను దింపిస్తానంటూ. "రెండురోజులు ఓపిక పట్టు లింగం!" అన్నాడు సూర్రాజు. కోటిలింగం 'సరే బాబూ' అంటూ తల ఆడిస్తూ వెళ్లాడు.

చిన్నాయనకు తెలియకుండా పెదాయన తోట బేరం ఇచ్చేశాడని నాసరయ్యకు తెలిసింది.

పెద్దాయనకు ఎరుక లేకుండా చిన్నాయన తోట బేరం ఫైసలుచేశాడని కోటిలింగానికి తెలిసింది.

కొబ్బరితోట బేరం విషయంలో తండ్రీ కొడుకులకు సిగపట్లుగా వుందని ఊరందరికీ తెలిసింది.

అయిదొందలు బయానా ఇచ్చిన నాసరయ్య ఎంతకాలం నోరుమూసికొని వూరుకొంటాడు? మూడొందలు బయానా ఇచ్చిన కోటిలింగమూ అంతే! అవతల సీజను పోయిందంటే– ఇరువురికీ వ్యాపారంలో లాభంపోయి గూబ గుయ్ మంటుంది. అందుచేత వాళ్లు మంచీ మర్యాదను తాత్కాలికంగా వాయిదావేసి జోగిరాజు ఇంటిచుట్టూ పదే పదే తిరుగసాగారు.

తండ్రీ కొడుకుల్లో ఎవ్వరూ మెట్టు దిగలేదు. ఒకరిది ఉడుం పట్టు, మరొకరిది మొసలిపట్టు. ఇంట్లో ఆడవారికి ఉపవాసాల పట్టుగా ఉంది. ఊళ్లోవాళ్లు పైపైతున పరిస్థితుల్ని గోడమీద పిల్లి వాటంగా తిలకిస్తున్నారు.

వారంరోజులు గడిచాయి.

ఎనిమిదో రోజున సూర్రాజు తండ్రిని నిర్మొహమాటంగా అడిగాడు: "నా భాగం నాకు పంచి ఇవ్వు."

జోగిరాజు నిర్విణ్ణుడైనాడు. కాని అప్పటికి వెనుకంజవేయలేదు.

"అలాగే"

"కొబ్బరితోట నాకే రావాలి!"

"ఎలా!"

"అంతే. నువ్వు భాగాలు వేయాలి. నేను కోరుకోవాలి."

"ఏ న్యాయశాస్త్రంలో ఉంది.''

''న్యాయశాస్త్రంలో లేకపోవచ్చు. కాని తండ్రి భాగాలు వేయడం, కొడుకు కోరుకోవడం సంప్రదాయం. దానికి కట్టుబడి వుండటం ధర్మం.''

"ధర్మా ధర్మాలతో నాకు నిమిత్తంలేదు. మన ఇద్దరిమధ్యా పంతమూ, పట్టుదలా వచ్చింది. అన్నింటి లాగానే కొబ్బరితోటా చెరిసగం కావల్సిందే!"

''సరే."

తల్లి గోడు గోడున ఏడ్చింది. పెద్ద మనుష్యులు వేరింటికాపరాలు తగవని శక్తి వంచనలేకుండా సలహాలిచ్చారు. కాని తండ్రీ కొడుకుల మధ్య పంతాలూ, పట్టింపులూ సడలలేదు.

జోగిరాజూ, సూర్రాజూ భాగాలు పంచుకున్నారు. రెండు కాపరాలైనాయి. పాకీత్తులు రాసుకున్నారు. రెండు వ్యవసాయాలైనాయి.

కొబ్బరితోటకు మధ్యగా పెద్ద గట్టును ఏర్పాటుచేశారు. సూర్రాజు తన భాగంలోని తోటలోని కాయల్ని కోటిలింగానికి ఇచ్చాడు. అలాగే జోగిరాజు తనభాగంలోని తోటలోని కాయల్ని నాసరయ్యకు ఇచ్చాడు. ఇరువురి బేరాలూ చెల్లుబడి అయినాయి.

ఇది జరిగిన మూడుమాసాలకు ఒకరోజు జోగిరాజు తోటదగ్గరకు వచ్చాడు. తోట చుట్టూ తిరిగిచూశాడు. ఒక్క చెట్టునా కాయ లేదు. తోటంతా కళచెడిపోయిన బీడులా ఉంది. చెట్లు దిగాలుపడి చూస్తున్నట్టున్నాయి. జోగిరాజు గుండె మండి ఎద్దులా కన్నీరు కార్చింది. గుండె బరువుతో ఇంటికి వెళ్లాడు. ఆ రాత్రంతా ఆలోచించాడు. తెల్లవారేపాటికి దృఢమైన ఓ నిర్ణయాని కొచ్చాడు. నలుగురు కూలీలను పిల్చాడు. వాళ్ళను వెంటపెట్టుకొని కొబ్బరి తోట దగ్గరకు వెళ్ళాడు. తోటకు మధ్యగా ఉన్న గట్టును తీసివేయమని ఆజ్ఞాపించాడు.

కూలీలు గడ్డపలుగులతో, పారలతో కొబ్బరితోట మధ్యనున్న పెద్ద గట్టును పడగొట్టి, చదునుచేస్తూవుంటే జోగిరాజు హృదయం సంతోష సాగరమైంది.

అంతలో సూర్రాజు తోటదగ్గరకొచ్చాడు. ''ఏమిటి నాన్నా!'' అన్నాడు ఆదుర్దాగా.

''పదిహేనేళ్ళనుంచీ ఈ తోటలోని చెట్లన్నీ ఒకటిగా, ఐకమత్యంగా కలిసిమెలిసి ఉన్నాయి. ఇప్పుడు వాటిని మనం విడదీయడం సమంజసంగా లేదు. ఎవరికోసమో, పంతాలకూ పట్టింపులకూ పోయి, మనగడ్డనే రెండుగా చేస్తామా! ఇవాళటినుంచీ ఈ కొబ్బరితోటా, పొలమూ, ఇల్లూ, డబ్బూ అంతా మనదే!'' అన్నాడు జోగిరాజు ఆవేశపూరితుడై.

నీళ్ళునిండిన కళ్ళతో తండ్రికేసి ఆప్యాయంగా చూస్తూ ''నాన్నా!'' అన్నాడు సూర్రాజు.

గోదావరిమీదనుంచి తూర్పుగాలి తెరలు తెరలుగా వీచనారంభించింది.

కొబ్బరిచెట్లు కలకలలాడుతూ తలలు ఆడించసాగాయి.

---